


## అసంపూర్తి వంతెన.. ఎంత కాలం యాతన

- నిధులు సరిపోవడం లేదంటూ
- మధ్యంతరంగా నిలిపివేత
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 04 | సంచిక : 60
పేజీలు : 08 | వెల: రూ.5/-

మంగళవారం
నవంబర్ 19, 2024

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net





# అసెంబ్లీకి రా.. తేల్చుకుందాం

- కేసీఆర్ ను ఫాం హౌస్ కే పరిమితం చేస్తా
- అందుకు కావాల్సిన మందు నా దగ్గర ఉంది
- కిషన్ రెడ్డికి ఇక్కడ ఉండే అర్హత లేదు
- వరంగల్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్
- ప్రాణం ఉన్నంత వరకు ప్రజల కోసమే పనిచేస్తా నంటూ హామీ





నీ సంగతి నాకు తెలుసు.. నీ ముందు తెలుసు..నీ వెనుక తెలుసు..కుక్క కాటుకు చెప్పు దెబ్బ.. నిన్ను ఓడిస్తా అని చెప్పా.. ఎన్నికల్లో ఓడించా.. పార్లమెంట్ లో గుండు సున్నా.. అయినా బిల్లా రంగాలు రెచ్చిపోతున్నారు..అసెంబ్లీకి రా కేసీఆర్.. తేల్చుకుంటాం అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్ కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. కేసీఆర్ ఫాం హౌజ్ లోనే ఉంటే మంచిదన్నారు. అక్కడే ఆయనకు కావాల్సిన మందు అందుబాటులో ఉంచుతామంటూ ఎద్దేవా చేశారు. ఆ పైసలు కూడా మా కార్యకర్తలే కట్టుకుంటారన్నారు. తెలంగాణ ఓట్లతో గెలిచిన కిషన్ రెడ్డి గుజరాత్ కు గులాం గిరి చేస్తున్నారని, ఆయనకు ఇక్కడ ఉండే అర్హతే లేదన్నారు. ప్రాణం ఉన్నంత వరకు ప్రజల కోసమే పనిచేస్తానన్నారు. ఒక్క నిమిషం తక్కువ కాకుండా రోజుకు 18 గంటలు పనిచేస్తానని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల అభివృద్దే నాలక్ష్యం అంటూ ఆయన ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయిన సందర్భంగా మంగళవారం హనుమకొండలోని ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో నిర్వహించిన తొలి ప్రజా పాలన విజయోత్సవ సభకు రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బీఆర్ఎస్, బీజేపీలపై నిప్పులు చెరిగారు. – వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి

వివరాలు 2లో..




## కాళోజి కళాక్షేత్రం ప్రారంభం

- ప్రజా కవి నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి
- రూ. 4,601.15 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ఆర్ట్ గ్యాలరీ సందర్శన
- కాళోజిపై నిర్మించిన లఘు చిత్రాన్ని వీక్షించిన రేవంత్

## అభివృద్దే ఆమె నైజం

- ఘనంగా ఇందిరాగాంధి జయంతి వేడుకలు







# అసెంబ్లీకి రా.. తేల్చుకుందాం..



- కేసీఆర్ ను ఫాం హౌస్ కే పరిమితం చేస్తా
- అందుకు కావాల్సిన మందు నా దగ్గర ఉంది
- కిషన్ రెడ్డికి ఇక్కడ ఉండే అర్హత లేదు
- వరంగల్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్
- ప్రాణం ఉన్నంత వరకు ప్రజల కోసమే పనిచేస్తానంటూ హామీ

**వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి :** ఓరుగల్లు సాక్షిగా అప్పుడు చెప్పా కేసీఆర్ ను ఓడిస్తానని.. అన్నట్లుగానే చేశా..పార్లమెంట్ లోనూ అదే చాలెంజ్ చేశా..బీఆర్ఎస్ కు గుండు సున్నా..ఇప్పుడు ఇదే వేదిక సాక్షిగా చెబుతున్నా.. కేసీఆర్ అనే విషపు మొక్కను మొలకెత్తనీయనని..రాసి పెట్టుకోండి.. కేసీఆర్ కాస్కో చూద్దాం.. అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్ కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. నీ దుఃఖం ఏందో.. నీ బాధ ఏందో అసెంబ్లీకి రా.. చర్చ పెడదాం..తేల్చుకుందామన్నారు. రా ప్రజాల్లోకి.. వచ్చి మాట్లాడు..నువ్ లేవనెత్తిన అంశాలు చర్చ పెడుతాం.. లేకుంటే నువు ఎక్కడికి రమ్మన్నా అక్కడి వస్తానంటూ సవాల్ విసిరారు. ఆయన రాడట కానీ ఇద్దరు చిల్లర గాళ్లను రోడ్డుపైకి వదిలిండు అంటూ కేటీఆర్, హరీష్ రావులను ఉద్దేశించి అన్నారు. ఫామ్ హౌస్ లో పడుకుంటే నీ గురించి తేవదనుకోకు.. నాకు ముందు తెలుసు.. వెనక తెలుసు.. కుక్క కాటుకు చెప్పు దెబ్బ ఎలా కొట్టాలో కూడా తెలుసన్నారు. మళ్లీ చెబుతున్నా.. రా బయటకు.. అంటూ కేసీఆర్ ను వార్నింగ్ ఇచ్చారు.

## ఆడబిడ్డల ప్రభుత్వం..

ఇందిరమ్మ రాజ్యంలో ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలని ఈ ప్రభుత్వం కంకణం కట్టుకుందని రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమం మా ఆడబిడ్డలకు అంకితం అన్నారు. ఈ అడబిడ్డలు మనసు నిండుగా నన్ను ఆశీర్వదించడం వల్లే ఇవాళ ఈ స్థానంలో ఉన్నానన్నారు. గత ప్రభుత్వం ఒక్క మహిళకు కూడా మంత్రి వర్గంలో అవకాశం కల్పించలేదు. మేము ఓరుగల్లు ఆడబిడ్డలకు మంత్రివర్గంలో ప్రముఖ స్థానం కల్పించామన్నారు. పాలకుర్తిలో ఒక రాక్షసుడిని ఓడించి పాలకుర్తి గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగరేసింది మన ఆడబిడ్డనే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా మహిళా అధికారి ఉన్నారు. ఇది ఆడబిడ్డల ప్రభుత్వం అని గర్వంగా చెప్పుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. టాటా బిర్లాలను తలదన్నేల రాష్ట్రంలో ఆడబిడ్డలను వ్యాపారస్తులుగా ప్రభుత్వం తీర్చిదిద్దబోతోందన్నారు. మేం నిర్మిస్తే మీరు వచ్చి కొబ్బరికాయ కొడుతున్నారని ఒకాయన మాట్లాడుతుండు. కాలోజీ కళాక్షేత్రాన్ని పదేళ్లైనా పూర్తి చేయనప్పుడే మీ బుద్ధి బయటపడిందని ఎద్దేవా చేశారు. మీరు పూర్తిచేయలేదు కాబట్టే.. మేం కాళోజీ కళాక్షేత్రాన్ని పూర్తి చేశామన్నారు.

## కాళ్లలో కట్టెలు పెట్టొద్దు..

వరంగల్ గడ్డపై రైతు డిక్లరేషన్ తో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ రూపురేఖలు మారిపోయాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఓరుగల్లు పోరాటంతో రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్నామన్నారు. చారిత్రాత్మక వరంగల్ నగరాన్ని హైదరాబాద్ కు ధీటుగా తీర్చి దిద్దాలని నిర్ణయించాం. అందుకు తగినట్లుగా చర్యలు చేపట్టాం. అందుకే వరంగల్ అభివృద్ధికి దాదాపు ఆరువేల కోట్లు కేటాయించించామన్నారు. వరంగల్ అభివృద్ధి జరిగితే సగం తెలంగాణ అభివృద్ధి జరిగినట్లేనన్నారు. వరగంల్ ను అభివృద్ధి చేసే వరకు నిద్రపోయేది లేదన్నారు. పదేళ్లలో మీరు చేసింది ఏమీ లేదు. ఇప్పుడు వచ్చి మేము చేస్తామంటే పనిచేసే వారి కాళ్లల్లో కట్టెలు పెడుతున్నారని దుయ్యబట్టారు. ఇలాగే చేస్తే వచ్చేసారి డిపాజిట్లు కూడా దక్కవన్నారు. కనీసం మీకు మమ్మల్ని అభినందించే మనసు లేదు కానీ.. శాపనార్థాలు పెడుతుండ్రు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వరి వేసుకుంటే ఉరే అని చెప్పిన వ్యక్తి కేసీఆర్. నేడు రాష్ట్రంలో 66 లక్షల ఎకరాల్లో 1కోటి 53 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం రైతులు పండించారు. దేశంలో ఎక్కడా ఇంత వరకు ఏ రాష్ట్రంలో ఈ స్థాయిలో వరి ధాన్యం పండిచలేదన్నారు.

## ఫామ్ హౌజ్ లోనే ఉండండి..

కేసీఆర్... మీరు ఫామ్ హౌసులోనే ఉండండి... మీకు కావాల్సిన మందు నాకు తెలుసు. అక్కడికే పంపిస్తా..మీరు డబ్బులు కూడా ఇవ్వనవసరం లేదు. మా పార్టీ కార్యకర్తలే చెల్లిస్తారంటూ రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఫామ్ హౌజ్ నుంచి మీరు కుట్రలు, కుతంత్రాలు చేయొచ్చు.. మీ కుట్రలను గుర్తించి ఊచలు లెక్కబెట్టిస్తాం అంటూ కేసీఆర్ కు సీఎం రేవంత్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. రాష్ట్రాన్ని కేసీఆర్ తాగుబోతుల రాష్ట్రంగా మార్చాలనుకున్నారన్నారు. పదినెలల్లో మీ ఇంట్లో నలుగురు ఉద్యోగం కోల్పోయారు తప్ప ఇంకేమీ కాలేదన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో 10 నెలల్లో 50వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. 22లక్షల రైతు కుటుంబాలకు రూ.18వేల కోట్లు రుణమాఫీ చేసిన ఘనత మా ప్రభుత్వానిదే అన్నారు. ఆనాడు భద్రకాళీ, సమ్మక్క సారక్క అమ్మవార్ల సాక్షిగా చెప్పా.. పంద్రాగస్టులోగా రుణమాఫీ చేసి తీరుతామని.. మాట ఇచ్చాం.. నిలబెట్టుకున్నామన్నారు. ఈ వేదికగా మాట ఇస్తున్నా.. మిగిలిన అందరికీ రుణమాఫీ చేసే బాధ్యత మాది. మాట ఇస్తే తల తెగిపడినా మడమ తిప్పని నైజం కాంగ్రెస్ ది.

## కిషన్ రెడ్డికి అర్హత లేదు..

గుజరాత్ బాస్ లకు గులాం గురి చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి తెలంగాణలో ఉండే అర్హత లేదన్నారు. గతంలో ఆయనపై మంచి అభిప్రాయం ఉండేదన్నారు. నేడు అది పోయిందన్నారు. కేటీఆర్ మాట్లాడగానే రెండోరోజు కిషన్ రెడ్డి మాట్లాడుతడు అంటూ ఎద్దేవా చేశారు. సోనియమ్మకు గులాం అని కిషన్ రెడ్డి మాట్లాడుతుండు. అరవై ఏళ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన తల్లి సోనియమ్మ అని గుర్తు చేశారు. సోనియమ్మ మా అమ్మ.. నాలుగుకోట్ల తెలంగాణ బిడ్డలకు ఆమె అమ్మ. అలాంటి ఆ తల్లి కాళ్లు కడిగి నీళ్లు నెత్తిన చల్లుకోవడానికి కూడా మేం సిద్ధం. ఇది మాకు అవమానం కాదు..ఆత్మ గౌరవం అన్నారు. ఆ తల్లి లేకుంటే తెలంగాణ ఉండేది కాదన్నారు. కిషన్ రెడ్డి సోనియమ్మ కాళ్లు కడిగి నెత్తిమీద చల్లుకుంటే.. మోదీకి ఊడిగం చేసిన పాపం కొంతైనా తగ్గుతుందన్నారు. తెలంగాణను అపహాస్యం చేసిన తెలంగాణ ద్రోహి మోదీ అన్నారు. ఆయనకు గులాంగా మారిన నీకు తెలంగాణలో ఉండే అర్హత లేదన్నారు. నీకు ఉద్యోగం ఇచ్చింది సికింద్రాబాద్ ప్రజలు.. ఆ ప్రజలకు కృతజ్ఞతగా ఉండు.. మోదీకి కాదు అంటూ చెప్పారు.














# ప్రధాని మోడీవి ప్రజా వ్యతిరేక విధానాలు



**వరంగల్ వాయిస్, జనగామ:** సంయుక్త కిసాన్ మోర్చా జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ అఖిల భారత కమిటీల పిలుపులో భాగంగా జనగామ జిల్లా వ్యాప్తంగా నేడు, రేపు జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. డిమాండ్ల సాధన కోసం రైతాంగ, కార్మిక వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మోడీ ప్రభుత్వం వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జనగామ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ జగన్ కు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందు నాయక్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి ఉపేందర్ మాట్లాడుతూ అన్ని పంటల ఉత్పత్తి ఖర్చుకు 50శాతం(సీ2+50) కలిపి మద్దతు ధరలను ప్రకటించాలి. చట్టబద్ధ కొనుగోలు హామీ నివ్వాలని కోరారు. లేబర్ 4 కోడ్స్ ను రద్దు చేయాలని, కాంట్రాక్టు విధానాన్ని నిషేధించాలని తదితర డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. ఈ డ్ల సాధన కోసం దేశవ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ నెల 26న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మహా ప్రదర్శన ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బేజ్జరబోయిన మల్లేష్, బండ సత్తయ్య, సీహెచ్ శ్రీకాంత్, ఎస్ ప్రభాకర్ రెడ్డి, కే బాల నరసయ్య పాల్గొన్నారు.

## ఘనంగా ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అఖిల భారత విద్యార్థి పరిషత్ హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో బాలసముద్రం ఏబీవీపీ ఆఫీసులో మంగళవారం స్త్రీ శక్తి దివాస్ ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా వచ్చిన రాష్ట్రీయ సేవిక సమితి జిల్లా కార్యవహ కవిత మాట్లాడుతూ ఝాన్సీ లక్ష్మీబాయి అసలు పేరు మణికర్ణిక ఆమె 1828 నవంబర్ 19న మహారాష్ట్రలో జన్మించిందన్నారు. ఆమెను వీరనారి కి ఒక గొప్ప ఉదాహరణగా చెప్పుకోవచ్చు. భారత దేశీయ సేనలో మొదటి మహిళా సమూహన్ని తయారు చేసినప్పుడు దానికి ఈమె పేరు పెట్టారు. భారత దేశ కవయిత్రి అయిన సుభద్ర కుమారి చౌహాన్ వీర రస శైలిలో ఆమె గురించి ఒక కవిత రచించారు. అది ఇప్పటికి భారత దేశ బడి పిల్లల చేత చెప్పబడుచున్నది. మరి ఈమె మహిళ శక్తిని ఎంతో గొప్పగా ప్రపంచానికి తెలియచెప్పిందన్నారు. అతి చిన్న వయసులో ఎన్నో విద్యల్లో నైపుణ్యం సంపాదించుకున్న ఝాన్సీ లక్ష్మీబాయి గుర్రం సవారి చేస్తూ ఎన్నో ఉద్యమాలు చేసిందని పేర్కొన్నారు. ఇప్పుడున్న సమాజంలో ప్రతి ఒక్క మహిళా ఈ విధంగా ఝాన్సీ లక్ష్మీబాయి గారిని ఆదర్శంగా తీసుకుని అన్ని రంగాల్లో ముందుండాలని తెలియజేయడం జరిగింది. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మిషన్ సాహసి పేరు మీద మహిళలకు సెల్ఫ్ డిఫెన్స్ కార్యక్రమాలు చేస్తూ విద్యార్థినిలు అన్ని రంగాల్లో ముందుండాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు సంపత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోడ బిందు, జిల్లా కన్వీనర్ ఆరేపల్లి సుజిత్, నగర కార్యదర్శి తాళ్లపెల్లి అరుణ్, రోహిత్, రేవంత్ పాల్గొన్నారు.

## రక్షణ కల్పించండి

### చౌటపల్లి సొసైటీ డైరెక్టర్ల వేడుకోలు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** అవిశ్వాస తీర్మానంపై బుధవారం జరగబోయే సమావేశానికి వచ్చే విధంగా సహకరించాలని చౌటపల్లి పీఏసీఎస్ సొసైటీ డైరెక్టర్లు పోలీసు అధికారులను, మీడియా మిత్రులను కోరారు. ఇటీవల చౌటపల్లి సొసైటీలో భారీ అక్రమాలు జరిగాయని చైర్మన్ వైస్ చైర్మన్ రైతుల దగ్గర నుంచి క్రాఫ్ లోన్ల కోసం డబ్బులు వసూలు చేశారని, పీఏసీఎస్ భవన, గోదాముల నిర్మాణంలో భారీ అక్రమాలు జరిగాయని ఆరోపణ చేస్తు అవిశ్వాస తీర్మానం కోరుతూ ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అధికారులు బుధవారం 20న చౌటపల్లి పీఏసీఎస్ లో అందరూ హాజరు కావాలని డైరెక్టర్లకు తెలిపారు. ఈ నేపథ్యంలో స్థానిక రాజకీయ నాయకులు అవిశ్వాస తీర్మానం పెట్టకూడదని ఫోన్లు చేయించి బెదిరిస్తున్నారని అవిశ్వాస తీర్మానాన్ని అడ్డుకుంటామని తమపై దాడి చేస్తామని తెలుపడంతో డైరెక్టర్లు అందరు కలిసి పక్క రాష్ట్రానికి క్యాంపుకు వెళ్లి రేపు తిరిగి రానున్నారు. వచ్చాక ఎక్కడ అడ్డుకుంటారోనని డైరెక్టర్లపై ఎక్కడ దాడి చేస్తారోనని భయపడుతూ స్థానిక ఎస్సై, సీఐ, ఏసీపీ, సీపీ అధికారులు తమకు ప్రొటెక్షన్ కల్పించి అవిశ్వాస తీర్మానం పెట్టే వరకు ప్రొటెక్షన్ ఇచ్చి సహకరించాలని డైరెక్టర్లు వీడియో సందేశాన్ని పోలీసులకు, విలేకరులకు సోషల్ మీడియాలో పంపించారు.

# కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మందకృష్ణమాదిగ పిలుపు మేరకు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు ఎండీ పాషా అధ్యక్షతన ప్రారంభమైన రిలే నిరాహారదీక్షలనుఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, వికలాంగులకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి రాక ముందుకు ఎన్నికల్లో వికలాంగులకు రూ.6000, వృద్ధులు, వితంతువులకు, చేనేత కార్మికులకు, గీత కార్మికులకు రూ. 4000 వేలు ఇస్తానని ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే, ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు, మహబూబాబాద్ జిల్లా ఇంచార్జి గుగ్గిళ్ల పీరయ్య మాదిగ మద్దతు తెలిపి మాట్లాడారు. హామీలను వెంటనే అమలు చేయకపోతే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఓట్లను అడిగే హక్కు ప్రభుత్వానికి లేదని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేసి ఓటు పరంగా రాష్ట్రవ్యాప్తంగా వికలాంగుల సత్తా చాటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమం ఉధృతం చేస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, వార్డు కౌన్సిలర్ యాళ్ల మురళీధర్ రెడ్డి,



లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు భీమా నాయక్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పొలేపాక ప్రవీణ్ మాదిగ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీహెచ్ పీఎస్ రాష్ట్ర నాయకులు అబ్బూరి వినోద్ రెడ్డి,చలగోల వెంకన్న, జిల్లా అధికార ప్రతినిధి భూక్య వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు మోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు బైగల్ల సహదేవుడు, జేరిపోతుల నారాయణ, గండమల్ల సంజీవ, జిల్లా కార్యదర్శి జల్లే ఉపేందర్, గుల్ల శ్రావణ్, జిల్లా నాయకులు దొంతు వెంకన్న, వీహెచ్ పీఎస్ మహిళ జిల్లా అధ్యక్షురాలు తంగళ్లపల్లి మంజుల, మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి సుమతి, జిల్లా ప్రధాన కార్యదర్శి మార్క రాము, బూర్ల ఉపేందర్ గౌడ్, రషిద, చామకూరి రాంబాబు, ఎంఎస్పీ జిల్లా ప్రచార కార్యదర్శి కందిపాటి భిక్షపతి, జిల్లా నాయకులు ఈదురు సైదులు, రమ, సోని పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ఆటల పోటీలు

### జిల్లా సంక్షేమ శాఖ అధికారి శిరీష



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం-2024 పురస్కరించుకొని దివ్యాంగుల జిల్లా స్థాయి ఆటల పోటీలు దివ్యాంగులకు ఈ నెల 23న ఎన్ టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నారు. జిల్లా స్థాయిలో జరిగే ఆటల పోటీలలో పాల్గొనే దివ్యాంగులు జూనియర్ విభాగం వయస్సు 10-17 సంవత్సరాలు, సీనియర్ విభాగంలో 18-54 సంవత్సరాలు వారికి షాట్ పుట్, చెస్, క్యారం పోటీలు, బాల బాలికలకు విడివిడిగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కాబట్టి, ఈ పోటీలలో స్పెషల్ స్కూల్ పిల్లలు, దివ్యాంగులు పాల్గొని జిల్లా స్థాయి ఆటల పోటీలను దిగ్విజయం చేయాలని కోరారు. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో ఉన్న వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపబడునని జిల్లా సంక్షేమ శాఖ అధికారి కె.శిరీష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ 91334 15312 సంప్రదించాలని పేర్కొన్నారు.

## భక్త మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపన



**వరంగల్ వాయిస్, చిల్పూర్ :** భక్త మార్కండేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. మంగళవారం చిల్పూర్ మండలం చిన్నపెండ్యాల గ్రామంలో భక్త మార్కండేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన, ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యుడు, కడియం శ్రీహరి పాల్గొన్నారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. త్వరలో పద్మశాలి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, యవకులు, భక్తులు పాల్గొన్నారు.

## 21న బీఆర్ఎస్ పార్టీ మహా ధర్నా



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీ పథకాల అమలు, ఔషధ పరిశ్రమ కోసం గిరిజనుల భూముల స్వాధీనంలో లగచెర్ల ఘటనను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 21న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించే మహా ధర్నాను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు కోరారు. జిల్లా కేంద్రంలో ధర్నా స్థలిని ఎమ్మెల్సీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహాధర్మకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు హాజరవుతారని తెలిపారు. ఫార్మాసిటీ కోసం మాజీ సీఎం కేసీఆర్ హైదరాబాద్ సమీపంలో 15 వేల ఎకరాల భూమిని సేకరించి మౌలిక సదుపాయాలు కల్పించి, అన్ని రకాల అనుమతులు వచ్చిన ఆ భూములను పక్కనపెట్టి, గిరిజనుల జీవనధారమైన పచ్చటి పంట పొలాల్లో ఫార్మసిటీ చిచ్చు పెట్టి భూములను బలవంతంగా లాక్కునే దుశ్చర్యలకు పాల్పడడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, కౌన్సిలర్ల, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

## మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, మరిపెడ:** మరిపెడ మండల ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ కు రాబోవు మూడేళ్లకు నూతన కమిటీని మంగళ వారం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మరిపెడ పట్టణంలోని మున్సిపల్ పార్క్ లో జరిగిన సర్వసభ్య సమావేశంలో మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షుడిగా జాటోతు నరేష్ నాయక్, ఉపాధ్యక్షుడిగా బానోతు రవి , ప్రధాన కార్యదర్శి బోడపట్ల లింగన్న, కోశాధికారిగా రేఖ రమేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు షేక్ ఫక్రుద్దీన్, సీనియర్స్ రహిమోద్దీన్, నర్సయ్య, ఎన్నికల కమిటీ సభ్యులు దశరథ, శ్రీకాంత్, మండల సభ్యులు అభి, రమేష్, అర్జున్, మధు, ఉమేష్ , సునీల్, మహేష్ పాల్గొన్నారు.

## ఝాన్సీ రాణి-రవీందర్ కు సత్కారం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కమలాపూర్ మార్కెట్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గా కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన తవుటం ఝాన్సీ రాణి-రవీందర్ నియాకమైన సందర్భంగా వారిని మర్యాద పూర్వకంగా వారి స్వగృహంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఇజ్జిగిరి దేవేందర్ – సంధ్య, నాంపెల్లి ప్రభాకర్ దంపతులు కలిసి శాలువా కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కమలాపూర్ మండల రైతులకు మద్దతు ధరతో పాటు, మార్కెట్ లో మెరుగైన వసతులు కల్పించి వ్యవసాయ మార్కెట్ మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు.

## సముద్రాల కృష్ణకు సన్మానం



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండలంలోని దేశరాజుపల్లి గ్రామానికి చెందిన సముద్రాల కృష్ణ కమలాపూర్ మార్కెట్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా నియామకమైన సందర్భంగా దేశరాజుపల్లి గ్రామంలో ఆయన్ని గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు సముద్రాల రమేష్, జిల్లా నాయకులు ఇజ్జిగిరి దేవేందర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి చేయూత



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** ప్రభుత్వ జూనియర్ కళాశాల ధర్మసాగర్ లో చదువుతున్న బొడ్డు ప్రత్యూష, బొడ్డు జానీ తండ్రి బొడ్డు వినోద్ అకాల మరణం చెందినందున కళాశాల ప్రధానాచార్యులు ఆసనాల శ్రీనివాసులు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, వారి కుటుంబాన్ని పరామర్శించి చేయూతను అందించారు. ఈ క్రమంలో విద్యార్థుల పరీక్ష రుసుమును చెల్లించారు. వారికి ఐదువేల నగదు రూపేణా డబ్బులు అందించారు. భవిష్యత్తులో వారి ఉన్నత విద్యకు గాను కావలసిన సహాయ సహకారాలను అందిస్తామని హామీ ఇస్తూ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు షేక్ ఆజం బాబురావు రాములు, వెంకట్, సదానందం, గణేష్, రాజేందర్, గోపాలకృష్ణ, ప్రభాకర్, మంజుల, రవి పాల్గొన్నారు.

# అసంపూర్తి వంతెన.. ఎంత కాలం యాతన



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** డోర్నకల్ మండలంలో 2021వ సంవత్సరంలో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని వెన్నారం తోడెళ్లగూడెం గ్రామ మధ్యలోని వెన్నారం పెద్ద చెరవు వాగుపై ఉన్న పాత వంతెన కొట్టుకుపోయింది. దీంతో సుమారు మూడు రోజులపాటు ఈ మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇక్కడి పరిస్తితి గమనించిన మానుకోట జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగం ద్వారా డోర్నకల్ రాకపోకలు కొనసాగించేందుకు సుమారు రూ.2.12 కోట్ల విలువతో అంచనా వ్యయంతో 2022లో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించారు. దీనిని 2023 ఆగస్టు 16న పనులు పూర్తి చేసుకుని



బ్రిడ్జిను ప్రారంభించారు. అయితే బ్రిడ్జ్ నిర్మాణం చేసి ఇరువైపులా అప్రోచ్ రోడ్డుకు మొరం పోసి వాటిపై బీటీ వేయకుండానే పనులు నిలుపుదల చేశారు. అంచనా నిధులు సరిపోవటం లేదని మరిన్ని నిధుల కోసం ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ప్రభుత్వం నుంచి ఆదేశాల, నిధుల కోసం ఎదురుచూస్తున్నారు.ఈ దరిమిలా గుంతలమైయంగా ఉన్న రోడ్డు నుంచి భారీ వాహనాలు ఇబ్బందిగా వెళుతున్నాయి. వర్షాలు పడితే ఈ సమస్య మరింత జఠిలంగా మారుతుంది. వీటిపై రాష్ట్ర ఉన్నత అధికారులు దృష్టి సారించి బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

# బుగులోని బ్రహ్మోత్సవాల హుండీ లెక్కింపు

- జాతర ఆదాయం రూ.12,24,034
- గతేడాది కన్నా రూ.2,46,000 అధికం


**వరంగల్ వాయిస్, రేగొండ :** కార్తీకమాసం పురస్కరించుకుని రేగొండ మండలం తిరుమలగిరి గ్రామ శివారులో బుగులోని గుట్టపై వెలిసిన శ్రీ వెంకటేశ్వర స్వామి జాతర ఈ నెల 14 నుంచి 18 వరకు జరుగగా జాతర హుండీ ఆదాయాన్ని మంగళవారం జాతర ప్రాంగణంలో గుట్ట కింద పరకాల డివిజన్ పరిశీలకులు ఎన్.కవిత, ఈఓ బిల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో లెక్కించారు. హుండీ లెక్కించగా నోట్లు రూ.5,16,825 లు, నాణెములు రూ.31620లు, మొత్తం రూ. 5,48,445లు, మిశ్రమ వెండి 220 గ్రాములు, టికెట్ బుక్స్, ప్రత్యేక దర్శనం ద్వారా రూ.2,73,200లు, గండా దీపం రూ.8760, కేశఖండన రూ.9580,లు అర్చన రూ.1555,లు తైబజార్ రూ.18000లు, టెండర్స్ ద్వారా 3,50,500లు, మొత్తం జాతర ఆదాయం రూ.12,24,034లు వచ్చినట్టు అధికారులు తెలిపారు. గతంలో



జరిగిన జాతర ద్వారా వచ్చిన ఆదాయం కంటే రూ.2,46,000లు ఈసారి అధికంగా వచ్చినట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతర కమిటీ చైర్మన్ రొంటాల వెంకటస్వామి, అర్చకులు కుర్మాచలం వెంకటేశ్వర్లు, ధర్మకర్తలు పులిగల పాపారావు, కడవైన భాస్కర్, మంద శివ పటేల్, చింతల భిక్షపతి, సుంకరి అనిత, సుంకు జితేందర్, కరేట్లపల్లి రాజేందర్, కాంగ్రెస్ నాయకులు గంగుల రమణారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మల విజేందర్, కాంగ్రెస్ గ్రామ కోశాధికారి పల్నాటి శ్రీనివాస్, సుంకరి శ్రీధర్, కళాకారుల సంఘం నాయకులు నిమ్మల రాజు, తదితరులు పాల్గొన్నారు.

# స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి.మురళీధర్ ఆదేశానుసారం మెటర్నల్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సారంగం ఆధ్వర్యంలో మంగళవారం మహబూబాబాద్ పట్టణంలోని స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. గర్భంలో బిడ్డ ఆరోగ్యంగా ఉన్నాడా లేదా, ఏమైనా అంగవైకల్యంతో ఉన్నాడా, లింగ సంబంధిత వ్యాధుల గుర్తింపు, చికిత్స, జన్యు జనితమైన జీవకణాలలో కలిగే అసాధారణ మార్పు గుర్తింపు, చికిత్స కోసం, ఈ సందర్భాల్లో మాత్రమే స్కానింగ్ మిషన్ ను ఉపయోగించుకోవాలని సూచించారు. గర్భస్థ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, లింగ నిర్ధారణ చేసినట్లయితే, చేపట్టిన వైద్యాధికారికి, ప్రోత్సహించిన కుటుంబ సభ్యులకు, పీసీపీఎన్ డీటీ యాక్ట్ 1994-1996 నిబంధనలను అనుసరించి మొదటి తప్పుకు రూ.10,000 జరిమానా, మూడు సంవత్సరాల జైలు శిక్ష, రెండవ తప్పుకు ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 50వేల జరిమానా విధించబడుతుందని, డాక్టర్ పట్టా రద్దుకు సిఫారసు చేపడుతుందని హెచ్చరించారు. ఆస్పత్రి ఆవరణంలో రిసెప్షనిస్ట్ ఉన్న గదిలో స్కానింగ్ నిర్వహిస్తున్న గదిలో పీసీ అండ్ పీఎన్ డీటీ సంబంధించిన లింగ నిర్ధారణ చేయబడదని బోర్డును ఏర్పాటు చేయాలని సూచించారు. చట్ట విరుద్ధమైన అబార్షన్స్ నిర్వహించినట్లయితే అట్టి యాజమాన్యాలపైన, మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ యాక్ట్ అనుసరించి చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ తనిఖీలో జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కే.ప్రసాద్, ఎల్.డి కంప్యూటర్ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.



### ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం పరిశీలన..

**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆలేరు గ్రామ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని డీఎంహెచ్ఓ డాక్టర్ మురళీధర్ ఆకస్మికంగా సందర్శించి అక్కడ అందుతున్న వైద్య సేవలను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు అందజేశారు. అలాగే, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో వేచి ఉన్న రోగులను పరీక్షించి వారికి మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలోని అన్ని ఆరోగ్య కార్యక్రమాలను ఆన్ లైన్ పోర్టల్ లో నమోదు చేయాలని, ఆబా కార్డులను 100 శాతం పూర్తి చేయాలని, గర్భిణీ స్త్రీలను 12 వారాల లోపే నమోదు చేసుకొని వారి మొదటి రెండు పరీక్షలను ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి చేత, మూడవ నాలుగవ పరీక్షలను గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ లోని గైనకాలజిస్ట్ ల చేత పరీక్షలకు తీసుకువెళ్లాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డీపీహెచ్ఎన్ఓ మంగమ్మ, ఆలేరు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరా గాంధీ సేవలు మరువలేనివి

## ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మాజీ ప్రధాని ఇందిరా గాంధీ సేవలు మరువలేనివని ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ కొనియాడారు. జిల్లా కేంద్రంలో ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో ఎమ్మెల్యే పాల్గొని ఆమె విగ్రహానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పేదరిక నిర్మూలన కోసం ఇందిరా గాంధీ ఎనలేని కృషి చేశారని, ఇందిరాగాంధీ ప్రధాని హోదాలో ఎస్టీ లకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. దేశవ్యాప్తంగా ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్లు, భూమి లేని పేదలకు భూములు పంచి వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఈ జయంతి వేడుకలో డాక్టర్ మురళి నాయక్, ఎమ్మెల్యే ఘనపూర్ అంజయ్య, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.





## వరంగల్ కొత్తవాడలో..

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కొత్తవాడలోని 80ఫీట్ల రోడ్డులో ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా చిప్ప వెంకటేశ్వర్లు నేత ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చిప్ప వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మాజీ ప్రధాని, ఉక్కు మహిళా దేశంలో అనేక సంస్కరణలు తెచ్చిన మహా నేత అని, గరీబీ హఠావో నినాదంతో పేదలకు ఉచితంగా భూములు, ఇందిరమ్మ ఇండ్ల స్థలాలు ఇచ్చి పేదల జీవితాలను మార్చిన గొప్ప మహిళా అని కొనియాడారు. ఆమె సేవలను గుర్తు చేస్తూ మంగళవారం ఘనంగా జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు దామెర రాజ్ కమల్, మాజీ కార్పొరేటర్లు దామెర సర్వేశ్, గుడిబోయిన మణి, కొక్కుల సతీష్, బొల్లు సతీష్, బండి రమేష్, కలకోటి భాస్కారాచారి, రావుల రాజీవ్, సందెల దామోదర్, మండల శంకర్,మానగాణి గోవింద్, ఎస్ కే సభా, గుత్తికొండ తిరుపతి, కూచన రవి, ఆదేపు రవి, దానం రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధే ఆమె నైజం

- ఇందిరకు ఘనంగా నివాళులర్పించిన ప్రముఖులు
- ఘనంగా 107వ జయంతి వేడుకలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** దేశాన్ని అభివృద్ధి పథంలో నిలిపేందుకు ఇందిరా గాంధీ చేసిన కృషి మరువలేనిదని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కొనియాడారు. మంగళవారం ఇందిరాగాంధీ 107వ జయంతి సందర్భంగా కాశిబుగ్గలోని ఆమె విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం హనుమకొండలోని డీసీసీ భవన్ లో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధ్యక్షతన ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొండ సురేఖతోపాటు ప్రభుత్వ ప్రధాన సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, కేఆర్.నాగరాజు, ఎమ్మెల్సీ బస్వారాజు సారయ్య, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని 27 డివిజన్లోని గిర్మాజీపేటలోని గోవిందరాజగుట్ట సమీపంలోని ఇందిరా గాంధీ విగ్రహానికి టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ ఆధ్వర్యంలో పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జారతి రమేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు భాషాపాక సదానందం, వరియోగుల శ్రీనివాస్, సందెల లాజర్, మంద శ్రీనివాస్, ఎండి తైమూర్, ఎర్రం కమల్, పొలెపాక విశాల్ బాబు, ఇనుగాల శరత్,,కట్కూరి అన్వేష్, కంచర్ల వేణు, కొమ్ము అమర్, సర్దార్ జస్వీర్ సింగ్, కొండమీది సదానందం, సోడా శ్రీనివాస్, మహిళా నాయకులు గూడ శారద, జహీరా తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలని, తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలని వరంగల్ బస్ స్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సాగర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి, జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ 2019 డిసెంబర్ నెల నుంచి ఆర్టీసీ కార్మిక సంఘాలపై విధిస్తున్న ఆంక్షలు ఎత్తివేయాలని, తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలని ఆర్టీసీ నిర్వహణలో కార్మిక సంఘాలకు భాగస్వామ్యం కల్పించాలని, సామాజిక భద్రత పథకాలకై పీఎఫ్, ఎస్ఆర్ బీ ఎస్ బీటీ ట్రస్టులకు కార్మిక సంఘాల ప్రతినిధుల భాగస్వామ్యంతో బోర్డు ఆఫ్ ట్రస్ట్ లను నియమించాలని ప్రజాతంత్ర హక్కులను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తుందన్నారు. ఈ సమస్యల కోసం ఆర్టీసీ డిపోల ముందు ధర్నా కార్యక్రమాన్ని చేపట్టాలని పిలుపునిచ్చాయన్నారు. ఆర్టీసీ కార్మికులకు అన్ని రంగాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని మద్దతు తెలియజేయాలన్నారు. ఆర్టీసీ కార్మికుల సమావేశం ఏర్పాటు చేసి రవాణా శాఖ మంత్రి కార్మికులకు న్యాయం చేసే విధంగా ప్రయత్నం చేయాలని ఆర్టీసీ కార్మికుల సంఘాలపై ఆంక్షలు ఎత్తివేసి తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలని, పని భద్రత కల్పించాలని సిబ్బందిని పెంచుతూ బస్సుల సంఖ్యను పెంచాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గున్నాల ప్రభాకర్, ఓదెలు, మూడేళ్ల ఉపేందర్, మీరు షాజియా, అప్పాజీ, వాణి, ఎండీ ఇస్మాయిల్, మేకల సరిత, రాఘవరెడ్డి, జుబేదా సూరయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా వెలుగులు



**వరంగల్ వాయిస్, పరకాల :** ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని పరకాల మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డులో సీఎస్ఐ గడ్డ ఏరియాలో స్థానిక కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత ప్రధానిగా ఇందిరా గాంధీ ఎనలేని సేవలను అందించారని కొనియాడారు. ఇందిరమ్మ కలలను సాకారం చేసే దిశలో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. త్వరలో ఇందిరమ్మ ఇల్లు పథకం రాబోతుందని కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్ అన్నారు. ఇందిరమ్మ కలలను సాకారం చేసే ఆలోచనలో భాగంగా నేడు సీఎం రేవంత్ రెడ్డి హనుమకొండ పట్టణంలో జరిగే బహిరంగ సభలో ఇందిరా మహిళా శక్తి పథకం ప్రారంభిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఒకటో వార్డు ప్రజలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల పెన్నిధి ఇందిరాగాంధీ

## కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ లో ఇందిరమ్మ రాజ్యం నడుస్తుందని, తెలంగాణలో పేదల సంక్షేమానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని, మంత్రి కొండా సురేఖ ,సీతక్క , ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో వరంగల్ నగర అభివృద్ధి పరుగులు పెడుతుందని శామంతుల శ్రీనివాస్ అన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా వరంగల్ జిల్లా కోర్టులో ఇందిరా గాంధీ చిత్రపటానికి వద్ద ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ కన్వీనర్ కొక్కొండ రమేష్, మాజీ బార్ అధ్యక్షుడు ఆనంద్ మోహన్, సీనియర్ న్యాయవాది అంబరిశ్రావు, స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ ముదాసీర్ అహమ్మద్, గునిగంటి శ్రీనివాస్, కందుకూరి రంజిత్, దయ్యాల సుధాకర్, దయన్ శ్రీనివాస్. ఏజ్జగిరి సురేష్, కూరపాటి అశోక్, ముకుంద రావు, పాల్గొన్నారు.

# యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, మరిపెడ :** మరిపెడ మండల టీఎస్ యూటీఎఫ్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి నందిగామ జనార్ధనా చారి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ మండల కమిటీ అధ్యక్షుడిగా గుగులోత్ లింగానాయక్ ప్రధాన కార్యదర్శిగా చెరుకుపల్లి ప్రభాకర్ ఉపాధ్యక్షుడిగా నెహ్రూ, కళ్యాణి, కోశాధికారిగా యాకయ్య, కార్యదర్శులుగా మారెడ్డి, దేవులా, మురళీకృష్ణ, ఐలయ్య, ఉప్పలమ్మ, చంద్రశేఖర్ లు, ఆడిట్ కమిటీ కన్వీనర్ గాశ్యాం బాబు, అకాడమిక్ కమిటీ కన్వీనర్లుగా లాల్ చంద్, నిర్మల గురుకులాల కమిటీ కన్వీనర్లుగా సుభాషిని, భారతి కేజీబీవీ కన్వీనర్ గా జ్యోతి, మోడల్ స్కూల్ కన్వీనర్ గా నాగార్జున, కల్చరల్ కన్వీనర్ గా నరేష్, జిల్లా కన్వీనర్లుగా నందిగామ జనార్ధన చారి, గోవర్ధన్, మంగు, ఎఫ్ డబ్ల్యూ కన్వీనర్ గా రామకృష్ణ ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు లింగా నాయక్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల కోసం పోరాడుతున్న ఏకైక సంఘం టీఎస్ యూటీఎఫ్ మాత్రమేనన్నారు. ఏకగ్రీవ ఎన్నిక కోసం సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

# రైతు గోవర్ధన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

### రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్




**వరంగల్ వాయిస్, దుగ్గొండి :** రైతులకు నాణ్యమైన కరెంటు ఇవ్వక పోవడం వల్ల వరికెల గోవర్ధన్ అనే పేద రైతు మరణించడం జరిగిందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ అన్నారు. దుగ్గొండి మండలం మందపల్లి గ్రామంలో ఈ నెల 12 న వరికెల గోవర్ధన్ అనే రైతు అతని సొంత భావి వద్ద కరెంటు సరిగా రాకపోవడం వలన స్టార్టర్ వద్ద చూస్తుండగా కరెంటు ఆనుకొని అక్కడికక్కడే మరణించారు. మరణించిన రైతు గోవర్ధన్ కుటుంబం వద్దకు రైతు సంఘం ప్రతినిధి బృందం వెళ్లి వారి కుటుంబ సభ్యులైన ఇద్దరు కుమారులు, భార్యను కలసి పరామర్శించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ  మొదటి నుంచి రైతు కుటుంబంగా జీవిస్తూ వీరికి ఉన్న రెండు ఎకరాలన్నర వ్యవసాయ భూమిలో బావిని తవ్వుకొని కరెంటు సాంక్షన్ నంబర్ 417గల నెంబర్ లో మోటర్ ను నడుపుకుంటున్నాడు. పంటలు పండిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. 12న ఉదయమే బావి దగ్గరికి వెళ్లగా కరెంటు సరిగా రాకపోడంతో పంట ఎండిపోతుందనే ఆవేదనతో స్టార్టర్ వద్ద చూస్తుండగా కరెంటు ఉన్న వైరు చేతికి తాకి అక్కడికక్కడే మరణించాడు. వీరి కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ. 10లక్షల ఎక్స్ గ్రేషియా ఇస్తూ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల ప్రధాన కార్యదర్శి లడే మోహన్ రావు, గ్రామ అధ్యక్షుడు రఘు సాల భుజంగరావు, జిల్లా కమిటీ సభ్యులు బరపటి రవీందర్, గ్రామ రైతులు అమరగుండ ఆనందరావు, వరికల కమలాకర్, ఆనందరావు పాల్గొన్నారు.

# డీఎంహెచ్ఓ నోటీసులు బేఖాతర్

### యధావిధిగా నడుస్తున్న క్లినిక్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగంరలో ఆగాపే హోలిస్టిక్ పాలి క్లినిక్ అనధికారంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర మన అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు బీఆర్ కే బుట్టి మహర్, జె.రామ స్వామి డీఎంహెచ్ ఓకు ఫిర్యాదు చేయడంతో డీఎంహెచ్ఓ తనిఖీ చేసి, విచారణ జరిపి ఇటీవల నోటీసులు జారీ చేసి, క్లినిక్ ను మూసివేశారు. వచ్చిన రోగులకు అవసరం లేకపోయినా ఎక్స్ రే, ఎంఆర్ఐలు తప్పనిసరి అని చెప్పి డయాగ్నోస్టిక్స్ సెంటర్లు దగ్గర కమిషన్ తీసుకొని ఈ విధంగా చేస్తున్నారు. అయినప్పటికీ కూడా డీఎంహెచ్ఓ నోటీసులు బేఖాతరు చేయకుండా మళ్లీ యధావిధిగా కార్యకలాపాలు నడిపిస్తున్నారు. దీనిపై డీఎంహెచ్ఓ స్పందించి భవిష్యత్తులో కూడా ఈ క్లినిక్ ఓపెన్ చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.


OFFICE OF THE DISTRICT MEDICAL AND HEALTH OFFICER/DISTRICT REGISTERING AUTHORITY, HANUMAKONDA

ORDER

# కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం

- 26న జిల్లా కేంద్రంలో నిరసన ప్రదర్శన
- రౌండ్ టేబుల్ సమావేశం నిర్ణయం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పాలకుల కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాలను, రైతులను, కార్మికులను ప్రజలను దోచుకునే పద్ధతులను రాజకీయాలకతీతంగా ఐక్యంగా ప్రతిఘటించాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కేఎం) రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్ , జిల్లా కన్వీనర్లు సోమిడి శ్రీనివాస్, రాచర్ల బాలరాజు, కార్మిక సంఘాల జిల్లా బాధ్యులు ముక్కెర రామస్వామి, గన్నారపు రమేష్, నర్ర ప్రతాప్, అక్కనపెల్లి యాదగిరి, రైతు వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర నాయకులు గోనె కుమారస్వామి, మొగిలి, ప్రతాపరెడ్,డి సుధమల్ల భాస్కర్, ఇంద్రసేనారెడ్డి, ఎంఏ పాషాలు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో నవంబర్ 26న వరంగల్ పట్టణంలో జరిగే భారీ నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరారు. ఈరోజు రైతు కార్మిక వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఎస్కేయం జిల్లా కన్వీనర్ కుసుం బాబూరావు, ఐఎఫ్ టీయూ జిల్లా బాధ్యుడు గంగుల దయాకర్ అధ్యక్షతన అబ్బని కుంటలోని రైతు భవన్ లో జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంభిస్తూ ఉత్పత్తిలో ప్రధాన భూమిక పోషించే రైతులను కార్మికులను కూలీలను విస్మరించి ప్రజలకు చెందాల్సిన సంపదను పెట్టుబడుదారులతో చేతులు కలిపి దోచుకు తింటున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలో రైతులు పండించిన పంటలకు కనీస గిట్టుబాటు ధర కల్పించకుండా మూడు నల్ల చట్టాలను, అలాగే కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయకుండా నాలుగు లేబర్ కోడులను తీసుకువచ్చి నియంతృత్వ పద్ధతుల్లో పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. అందుకని గత ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వ బలాన్ని కుదించిన కనీస గుణపాఠం రాలేదని, ఇలాంటి పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా కార్మికులు రైతులు కూలీలు ఐక్యంగా పోరుబాట పట్టి ముందుకు సాగుతున్నారన్నారు. అందులో భాగంగానే చారిత్రాత్మక ఢిల్లీ రైతాంగ ఉద్యమం, నాలుగు సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా బీజేపీ మోడీ ప్రభుత్వానికి గుణపాఠం వచ్చేలా ఈ నెల 26న దేశవ్యాప్తంగా ఐదు వందల జిల్లాలలో భారీ నిరసన ప్రదర్శనలు, ఆందోళనలు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో వరంగల్ పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించి నిరసన తెలియజేస్తామన్నారు. కార్మికులు, రైతులు, కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని రకాల హామీలను తక్షణమే అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కార్మిక, రైతు సంఘాల నాయకులు కాసు మాధవి, సుంచు జగదీశ్వర్, మాలోత్ సాగర్, ఐతం నగేష్, జి ఓదేలు, హసీనా, యాకూబ్ పాషా పాల్గొన్నారు.

# రాజకీయాలు లేకుండా ప్రజాస్వామ్యం లేదు

### మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి




**వరంగల్ వాయిస్, కేయూ :** దేశంలో 76ఏళ్లుగా అన్ని రంగాల్లో వెనుకబాటుతనానికి ఉన్నత వర్గాల ఆధిపత్య ధోరణే కారణమని తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు అన్నారు. పూలే ఆశయ సాధన సమితి (పాస్)ఆధ్వర్యంలో మంగళవారం కాకతీయ విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం కాన్ఫరెన్స్ హాల్ లో "కులగణన –సామాజిక న్యాయం"అనే అంశంపై నిర్వహించిన రాష్ట్ర స్థాయి సదస్సులో ప్రొఫెసర్ విశ్వేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సదస్సుకు పాస్ రాష్ట్ర అధ్యక్షుడు జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ సంగని మల్లేశ్వర్ అధ్యక్షత వహించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయాలు లేకుండా ప్రజాస్వామ్యం లేదన్నారు. ప్రజలు కోరుకుంటున్నదేమిటి, పాలకులు చేయాల్సిందేమిటని ఈ కులగణన ద్వారా బహిర్గతం అవుతుందన్నారు. ఎన్నికల ముందు సీఎం రేవంత్ రెడ్డి హామీ మేరకు సమగ్ర కులగణన సర్వే కొనసాగుతుందని చెప్పారు. ప్రస్తుతం కొనసాగుతున్న సమగ్ర కుల గణన సర్వే విషయంలో ఎవరికీ ఎన్ని అనుమానాలు ఉన్నా, మనకు టార్చ్ లైట్ లాంటిది అని, వెలుగు మార్గం అని కే.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బీహార్ లో కులగణనను సమర్థించిన కేంద్రం, తెలంగాణలో కొనసాగుతున్న సమగ్ర కులగణన విషయంలో అసంతృప్తిగా ఉందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పాస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ తాడూరి శాస్త్రి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చందా మల్లయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్, పాస్ నాయకులు డాక్టర్ డి. శ్రీకాంత్ యాదవ్, డాక్టర్ వంగాల సుధాకర్, కంజర్ల నరసింహా రాములు, పి.వెంకటేశ్వర్లు, డాక్టర్ మోటె చిరంజీవి, ఈర్ల సురేందర్, పాస్, వివిధ బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా ప్రియా రెడ్డి

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ అధ్యక్షుడు చంటి ముదిరాజ్, తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సూర స్రవంతి మంగళవారం గంగా రజినీ ప్రియా రెడ్డికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రియా రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో తెలంగాణ రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా నియమించిన జాతీయ అధ్యక్షుడు చంటి ముదిరాజ్ కు, తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సూర స్రవంతికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రియా రెడ్డి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల నుంచి సహకారం లభించడం లేదన్నారు. అధికారుల్లో జవాబుదారితనం కొరవడిందన్నారు. సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్న 30రోజుల్లో ఆ వ్యక్తికి కోరిన సమాచారం అందించాల్సిన బాధ్యత ఆయా అధికారులపై ఉందన్నారు. నిర్ణీత సమయంలోపు అందించకపోతే అప్పిలేట్ అధికారికి అప్పీల్ చేసుకోవచ్చన్నారు. ఇక్కడా స్పందన రాకపోతే రాష్ట్ర సమాచార చట్టం చీఫ్ కమిషనర్ కు అప్పీల్ చేసుకోవాలన్నారు. కమిషన్ స్పందించి సంబంధిత అధికారులపై



చర్యలు తీసుకుంటుందన్నారు. సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజ్యాంగం కల్పించిన ఈ హక్కును నిరాకరించే అధికారం ప్రభుత్వ వ్యవస్థలో ఏ శాఖ, అధికారికి లేదన్నారు. సంస్థ నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి బయటకు తీస్తూ సమాచార హక్కు చట్టం గురించి పౌరులకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గుండెల రాయుడు, బత్తుల మహేష్ గౌడ్, కట్ట యాదగిరి ముదిరాజ్, నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ఇదే మొదటిసారి..


'తండేల్' సినిమాతో ఫుల్ బిజీగా ఉన్నారు నాగచైతన్య. ఆ తరవాత 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నాడు. స్క్రిప్ట్ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఇప్పుడు నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల కోసం ఎంపిక జరుగుతోంది. ఈ చిత్రంలో కథానాయికగా మీనాక్షి చౌదరిని ఎంచుకొన్నట్టు చిత్ర వర్గాల నుంచి సమాచారం. చైతూ పక్కన నటించడం మీనాక్షికి ఇదే మొదటిసారి.. ఈ కాంబో ఫ్రెష్ గా ఉంటుందని చిత్రబృందం అనుకుంటోందట. ఈ సినిమాలో పూజా హెగ్డే కథానాయికగా నటించబోతోందని కూడా వార్తలు వస్తున్నాయి. దాంతో ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్లు ఉండబోతున్నట్టు ఫిక్సయింది. మీనాక్షి చౌదరి ఈ ఏడాదంతా బిజీ బిజీగా గడుపుతోంది. సంక్రాంతికి ఆమె నటించిన 'గుంటూరు కారం' విడుదలైంది. మహేశ్‌కు మరదలుగా కనపించింది. ఇటీవల విడుదలైన 'లక్కీ భాస్కర్'తో సూపర్‌హిట్ అందుకుంది. మొన్నే మట్కా విడుదలైంది. ఈ వారంవిడుదల కానున్న మెకానిక్ రాకీలో కూడా ఆమె కథానాయికగా నటించింది. 2025 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానున్న 'సంక్రాంతికి వస్తున్నాం'లో కథానాయికగా నటిస్తోంది. ప్రస్తుతం టాలీవుడ్‌లో మోస్ట్ బిజీయెస్ట్ కథానాయిక గా మారింది మీనాక్షి. ప్రస్తుతం తన చేతిలో నాలుగు సినిమాలున్నాయి. ఇప్పుడు చైతూ సినిమా కూడా యాడ్ అయింది.




## రిలీజ్‌కు ముందే రికార్డు

పుష్పరాజ్ అంటే ఫైర్ అనుకుంటివా.. వైల్డ్‌ఫైర్ అనుకుంటూ అల్లు అర్జున్ ట్రైలర్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ ట్రైలర్ సెకండ్స్‌లోనే మిలియన్ల వ్యూస్‌ను సొంతం చేసుకొని యూట్యూబ్‌లో టాప్ ట్రెండిరగ్‌లో కొనసాగుతుంది. ఈ చిత్రం డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. అయితే ఇప్పటికే ఓవర్సీస్ బుకింగ్స్ స్టార్ట్ అవ్వగా అరుదైన రికార్డును సాధించింది ఈ చిత్రం. అమెరికా అడ్వాన్స్ బుకింగ్స్‌లో తాజాగా 1 మిలియన్ డాలర్స్ కలెక్షన్స్ వసూలు చేసింది ఈ చిత్రం. సినిమా విడుదలకు ఇంకా 15 రోజులు ఉండగా.. ఇప్పుడే 1 మిలియన్ కలెక్ట్ చేయడంతో అమెరికాలో ఈ ఫీట్ సాధించిన ఫస్ట్ సినిమాగా నిలిచింది. ఈ రేంజ్‌లో బుకింగ్స్ ఉంటే ఇంకా విడుదలయ్యాకా ఎలా ఉంటుందో అని ఫ్యాన్స్ చర్చించుకుంటున్నారు.

## 'అన్‌స్టాపబుల్' షో సీజన్ 4లో అల్లు అర్జున్ పిల్లల సందడి



బన్నీ సోషల్ మీడియాలో ఎంత ఫేమస్సో .. ఆయన గారాల పట్టి అల్లు అర్హకూడా అంతే ఫేమస్. ఇక నెట్టింట తండ్రీ కూతురు చేసే అల్లరి అంతా ఇంతా కాదు. వీరిద్దరికి సంబంధించిన వీడియోలను బన్నీ భార్య అల్లు స్నేహ రెడ్డి తరచూ సోషల్ మీడియా ద్వారా పంచుకుంటుంటారు. అయితే అర్హ తాజాగా బాలకృష్ణ హోస్ట్‌గా చేస్తున్న 'అన్‌స్టాపబుల్' షో సీజన్ 4 హాజరయ్యింది. తన తండ్రితో పాటు షోకి వచ్చిన అర్హ బాలయ్యతో సరదాగ ముచ్చటించింది. ఇక బాలయ్య కూడా అర్హతో సందడిగా గడపడమే కాకుండా.. దగ్గరికి తీసుకుని ముద్దాడాడు. అయితే ఈ షోలో బాలయ్య అర్హను అడుగుతూ.. తెలుగు వచ్చా అమ్మ అని అడుగుతాడు. దీనికి అల్లు అర్జున్ స్పందిస్తూ.. తెలుగు రావటమా.. అంటూ తన కూతురు చెవిలో పద్యం పాడు అంటాడు. దీంతో అర్హ అల్లసాని పెద్దన్న రచించిన మను చరిత్రలోని ''అటజని కాంచె భూమిసురు డంబర చుంబి .. శీతశైలమున్.'' అంటూ ఫుల్ పద్యం చదివేస్తుంది. దీంతో ఒక్కసారిగా షాక్ తింటాడు బాలయ్య. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

## 'ఐ హేట్ యూ అమీర్'

### అమీర్‌ఖాన్ ను టార్గెన్ చేసిన సల్మాన్



బాలీవుడ్ కా భాయ్ 'సల్మాన్ ఖాన్' అభిమానులతో పాటు హేటర్స్ కూడా ఎక్కువే. కానీ, భాయ్ హేటర్స్‌ని మాత్రం పట్టించుకోకుండా కొన్ని దశాబ్దాల నుండి బాలీవుడ్‌లో స్టార్ హీరోగా కొనసాగుతున్నారు. అయితే పర్ఫెక్ట్ హీరోగా పేరు పొందిన 'అమీర్ ఖాన్'పై ఆయన బహిరంగంగానే తన ద్వేషాన్ని ప్రదర్శించారు. ఇంతకీ ఏమైందంటే..

2016లో రెజ్లింగ్ ఆధారంగా సల్మాన్ ఖాన్ 'సుల్తాన్' సినిమా రిలీజై సంచలన విజయాన్ని నమోదు చేసుకుంది. రూ. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రూ. 623 కోట్ల వసూళ్లను కైవసం చేసుకుంది. 'అమీర్ ఖాన్' ప్రధాన పాత్రలో నటించిన 'దంగల్' సినిమా తెరకెక్కింది. ఈ సినిమా ఏకంగా కొత్త చరిత్రనే సృష్టించింది. రూ. 2000 కోట్లకు పైగా వసూళ్లను కొల్లగొట్టి సరికొత్త చరిత్ర రికార్డ్ చేసింది. ఈ నేపథ్యంలోనే సల్మాన్ ఖాన్ అమీర్ ని టార్గెట్ చేస్తూ ట్విట్టర్ లో ఒక పోస్ట్ చేశారు. పర్సనల్‌గా నువ్వంటే నాకు అభిమానమున్న వృత్తిపరంగా 'ఐ హేట్ యూ అమీర్' అంటూ'' సరదాగా పోస్ట్ చేశారు. దీంతో అప్పట్లో ఈ పోస్ట్ తెగ వైరల్ అయ్యింది. సరిగ్గా ఈ ఘటన జరిగి ఎనిమిదేళ్లు గడుస్తుండటంతో మరోసారి ట్రెండిరగ్‌లోకి వచ్చింది.



# కాళోజి కళాక్షేత్రం ప్రారంభం

- **ప్రజా కవి నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి**
- **రూ. 4,601.15 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**
- **ఆర్ట్ గ్యాలరీ సందర్శన**
- **కాళోజిపై నిర్మించిన లగు చిత్రాన్ని వీక్షించిన రేవంత్**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అద్భుతం ఆవిష్కృతమైంది.. కలలు, కళాకారులకు పుట్టినిల్లుగా పేరుగాంచిన ఓరుగల్లు కళామతల్లి శిఖలో మరో మణిహారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆశిష్కృతమైంది.

జిల్లా ప్రజలు కళాకారులు కళాభిమానులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కాళోజి కళాక్షేత్రాన్ని మంగళవారం ముఖ్యమంత్రి రెడ్డి ప్రారంభించారు. అంతకుముందు హనుమకొండ కుడా గ్రౌండ్స్ లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం 2.30 కు రేవంత్ రెడ్డి చేరుకున్నారు. ఆయనకు మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్వాగతం పలికారు. అక్కడ నుంచి నేరుగా కాళోజి కళాక్షేత్రానికి చేరుకొని ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క తో కలిసి ముందుగా ప్రముఖ కవి కాళోజి నారాయణరావు నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం హనుమకొండ వరంగల్ జిల్లాలకు సంబంధించిన రూ.4,601.15 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపణలు, ప్రారంభోత్సవాలను అక్కడే ఏర్పాటు చేసిన స్క్రీన్ ద్వారా చేశారు. అనంతరం కళాక్షేత్ర భవనాన్ని రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. కాళోజీ కళాక్షేత్ర భవనంలోని కింది అంతస్తులో కాళోజీ నారాయణరావు వ్యక్తిగత జీవితంలోని ప్రత్యేక క్షణాలను ప్రతిబింబించే ఫొటోలు, పురస్కారాలు, వ్యక్తిగత వస్తువులు ప్రదర్శించిన ఆర్ట్ గ్యాలరీని సందర్శించారు. ఈ సందర్భంగా కాళోజి ఫౌండేషన్ ప్రతినిధులు వీఆర్ విద్యార్థి, పొట్లపల్లి శ్రీనివాస్ రావులు ముఖ్యమంత్రికి కాళోజి జీవితం అక్కడి వస్తువుల గురించి వివరించగా ముఖ్యమంత్రి ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఆడిటోరియం లో కాళోజి జీవిత విశేషాలతో నిర్మించిన లఘు చిత్రాన్ని కాళోజి ట్రస్ట్ ఫౌండేషన్ సభ్యులు, ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి విక్షించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత అంపశయ్య నవీన్ ట్రస్ట్ సభ్యులు ముఖ్యమంత్రికి పుష్పగుచం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆడిటోరియం బయట ఇందిరా ఫెలో షిప్ సభ్యులు, స్థానికి పార్టీ ప్రజా ప్రతినిధులను ముఖ్యమంత్రి కలిశారు. అక్కడ నుంచి నేరుగు ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బయలుదేరారు.

**అభివృద్ధి పనుల వివరాలు..**

కాళోజి కళాక్షేత్రం ప్రారంభం – రూ.90 కోట్లు
అండర్ డ్రైనేజీ వ్యవస్థ శంఖుస్థాపన – రూ.4,170 కోట్లు
నార్కోటిక్ పోలీస్ స్టేషన్ ప్రారంభం – రూ.12 లక్షలు
నయీమ్ నగర్ బ్రిడ్జి ప్రారంభంరూ.8.30 కోట్లు
వరంగల్ తూర్పు అభివృద్ధి పనుల శంకుస్థాపన – రూ.3 కోట్లు
పాలిటెక్నిక్ కళాశాల శంఖుస్థాపన – రూ.28 కోట్లు
కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ ఆర్, ఆర్ లేఔట్, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు శంఖుస్థాపన – 863 ప్లాట్లు, రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.43.15 కోట్లు
ఫ్లడ్ డ్రైనేజీ సిస్టం శంఖుస్థాపన – రూ.160.3 కోట్లు
కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ టౌన్షిప్ ఆవరణలో పీహెచ్సి, ప్రైమరీ స్కూల్, పశు వైద్యశాల శంకుస్థాపన – రూ.13 కోట్లు
వరంగల్ పట్టణం రహదారుల అభివృద్ధి శంకుస్థాపన – రూ.49.50 కోట్లు
పరకాల నుంచి ఎర్రగట్టు గుట్ట రోడ్డు 4 లైన్ల విస్తరణ – రూ.65.0 కోట్లు
కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ లో మౌలిక సాధుపాయల కల్పనకు శంకుస్థాపన – రూ.11.6 కోట్లు
వరంగల్ ఎల్ బీ నగర్ లో ఉర్దు భవనం శంకుస్థాపన –రూ.1.50 కోట్లు

ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర రోడ్ల భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ రాజకీయ సలహాదారు కె.కేశవరావు, తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి అజిత్ రెడ్డి, ఎంపీలు బలరాం నాయక్, డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, మధుసూధనాచారి, గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, రేవురి ప్రకాష్ రెడ్డి, కెఆర్ నాగరాజు, యశస్విని రెడ్డి, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, ఎంఏ యుడి ప్రిన్సిపాల్ సెక్రెటరీ దానా కిషోర్, రోడ్ల భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన, సమాచార శాఖ కమిషనర్ డాక్టర్ హరీష్, విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, వరంగల్, హనుమకొండ కలెక్టర్లు డాక్టర్ సత్య శారదా, ప్రావీణ్య, కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాఖేడేలతోపాటు ఇతర ప్రజాప్రతినిధులు, రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.













## ఆకట్టుకున్న మహిళా శక్తి గ్యాలరీ

ఇందిరా మహిళా శక్తి సభ సందర్భంగా హనుమకొండ ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్యాలరీలో నూటెంకి భవ్య వేసిన ఆర్ట్ చిత్రాలు ఆకట్టుకున్నాయి. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం నాచినపల్లి గ్రామానికి చెందిన నూటెంకి జయ ప్రభాకర్ దంపతుల కూతురు భవ్య ఆర్ట్ గ్యాలరీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భవ్య ఆర్ట్ గ్యాలరీ నీ మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, ధనుసరి అనసూర్య (సీతక్క) , వరంగల్ ఎంపీ కడియం కావ్య, సేర్ప్ సీఈవో దీపా దేవరాజన్, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సందర్శించారు.



## విజయోత్సవ సభకు తరలిన మహిళలు

హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో నిర్వహించేనున్న కాంగ్రెస్ ప్రజా పాలన విజయోత్సవ సభకు మొగుళ్ళపల్లి మండలం నుంచి భారీ సంఖ్యలో మహిళలను బస్సుల్లో తరలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి విజయోత్సవ సభకు తరలి వెళ్లే బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండి రఫీ, కాంగ్రెస్ పార్టీ మొగుళ్లపల్లి మండల ప్రధాన కార్యదర్శి నడిగోటి రాము, రంగాపురం మాజీ ఎంపీటీసీ ఆకుతోట లక్ష్మి, యూత్ కాంగ్రెస్ నాయకుడు యార అజయ్ రెడ్డి, ఎంపీడీవో హుస్సేన్, ఏపిఎం రవివర్మ, సిఏ మాధవి తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE. EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com